నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 19 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

శనిగ కుంట మత్తడి బ్లాస్టింగ్‌పై విచారణ

శనిగకుంట మత్తడిని పేల్చడంతో వృథాగా పోతున్న నీరు

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 18 : చెన్నూర్‌లోని శనిగ కుంట మత్తడి కాంక్రీట్ నిర్మాణాన్ని గుర్తు తెలియని వ్యక్తులు డిటోనేటర్లతో సోమవారం రాత్రి పేల్చి వేశారు. చెరువులోని సగం నీరు వృథాగా పోయింది. చెన్నూర్ డివిజన్ నీటి పారుదల శాఖ ఈఈ విష్ణు ప్రసాద్, డీఈ వేణుగోపాల్, ఏఈ తిరుపతి, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పేల్చివేతకు ఉపయోగించిన డిటోనేటర్ల వైర్లను చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ ఆధ్వర్యంలో సేకరించారు. అనుమానితులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గతంలో జరిగిన విషయాలను, అనుమానితుల వివరాలను పరిసర ప్రాంత వాసులను ఆరా తీశారు. ఘటనా స్థలాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు, బుధవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. వీలైనంత త్వరలో నిందితులను పట్టుకొని, చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎకరానికి రూ. 50 లక్షలు ఇవ్వాలి

ఎన్‌హెచ్ గ్రీన్‌ఫీల్డ్ భూ నిర్వాసితుల డిమాండ్

కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న భూనిర్వాసితులు

నస్పూర్, సెప్టెంబర్ 18 : నేషనల్ హైవే గ్రీన్ ఫీల్డ్‌లో కోల్పోతున్న భూములకు ఎకరానికి రూ. 50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందించారు. జైపూర్ మండల పరిధిలో ఎకరానికి రూ. 50 లక్షల నుంచి కోటి రూపాయల ధర ఉందని కానీ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితులకు ప్రభుత్వం రూ. 8లక్షల నుంచి 9 లక్షల వరకు పరిహారం ఇచ్చేందుకు యత్నించడం సరికాదన్నారు. గతంలో ఇందారం ఓసీ నిర్వాసితులకు రూ. 24 లక్షల పరిహారం ఇచ్చారని తెలిపారు. కలెక్టర్ స్పందించి ఎకరానికి రూ. 50 లక్షలు ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూనిర్వాసితులు మల్లేశ్, రామారావు, వినోద్ శర్మ, కృష్ణమూర్తి, శ్రీనివాస్, భూమయ్య, తిరుపతి, సమ్మయ్య, లింగయ్య పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశృతి

- క్రేన్ ఢీకొని మున్సిపల్ కార్మికుడి మృతి
- మరొకరికి గాయాలు
- అధికారుల నిర్లక్ష్యంతోనే కార్మికుడి మృతి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

లింగంపల్లి నగేశ్ (ఫైల్)

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 18: కాగజ్‌నగర్ పట్టణ సమీపంలోని పెద్ద వాగు వద్ద మంగళవారం అర్ధరాత్రి వినాయక నిమజ్జనం చేస్తుండగా క్రేన్ ఢీకొని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుడు లింగంపల్లి నగేశ్ (50) మృతి చెందగా, మరో కార్మికుడు ప్రేమ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు నగేశ్, ప్రేమ్‌కుమార్‌కు అధికారులు కాగజ్‌నగర్ పెద్దవాగు వద్ద వినాయక నిమజ్జన విధులు కేటాయించారు. నిమజ్జనం చేస్తున్న క్రమంలో క్రేన్ టైరు నగేశ్‌పైకి ఎక్కడంతో రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. మరోకార్మికుడు ప్రేమ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. నగేశ్‌ను హుటాహుటిన కాగజ్‌నగర్ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కరీంనగర్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రస్తుతం కార్మికుడు ప్రేమ్‌కుమార్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి కూతురు లక్ష్మీప్రసన్న బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రేన్ ఆపరేటర్ మేకల అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మహేందర్ తెలిపారు.

మృతదేహంతో ఆందోళన

నగేశ్ కుటుంబానికి న్యాయం చేయాలని కార్మికులు, మృతుడి బంధువులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మృతదేహంతో ఆందోళన చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుతో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, కార్మిక సంఘం నాయకుడు ముంజంఆనంద్ మద్దతు తెలిపారు. రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం, స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా ఘటన స్థలానికి చేరుకొని సముదాయించారు. కార్మిక సంఘం ముఖ్య నాయకులతో, అధికారుల సమక్షంలో చర్చలు జరిపారు. మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందించారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూం ఇల్లు అందిస్తామనడంతో కార్మికులు ఆందోళన విరమించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు చెక్కును అందించి, రావాల్సిన ఇన్సూరెన్స్ డబ్బులు మృతుడి కుటుంబానికి అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం నాయకులు శంకర్, సంజీవ్, కార్మికులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 18: అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడు లింగంపల్లి నగేశ్ (50) మృతి చెందాడని, మరో కార్మికుడు ప్రేమ్‌కుమార్‌కు గాయాలయ్యాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దవాగు వద్ద కనీస జాగ్రత్తలు తీసుకోకుండా మున్సిపల్ సిబ్బందికి ఇష్టారాజ్యంగా పనులు కేటాయించడం, అరకొర లైటింగ్, శిక్షణ లేని క్రేన్ ఆపరేటర్‌ను నియమించడంతోనే ప్రమాదానికి కారణమని ఆరోపించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గాయపడ్డ కార్మికుడు ప్రేమ్‌కుమార్‌కు ఎక్స్‌గ్రేషియాతో పాటు చికిత్స ఖర్చంతా ప్రభుత్వమే భరించాలన్నారు. ఇరు కుటుంబాల పిల్లలకు చదువు ఖర్చు, పక్కా ఇండ్లు ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలన్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్మికుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే ఈ ఘటనపై వెంటనే స్పందించాలని ముఖ్యమంత్రి, అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రికి ఎక్స్(ట్విట్టర్) ద్వారా ప్రశ్నించారు.

రుణమాఫీలో కాంగ్రెస్ విఫలం

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల మందికి రుణమాఫీ చేయాల్సి ఉండగా కేవలం 21 లక్షల మందికే లోన్ మాఫీ జరిగిందన్నారు. పెళ్లిలకు, పేరంటాలకు మాత్రం హెలికాప్టర్‌లో తిరుగుతూ మంత్రుల ప్రజాధనం వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టిస్తున్నారని అన్నారు. తెలంగాణను దోచుకొని, అణచివేసిన కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే తొలగించి, తెలంగాణ తల్లి విగ్రహం పెడుతామన్నారు. దహేగాం మండలంలో గత కలెక్టర్ పేద దళితులకు ఇండ్ల స్థలం కేటాయిస్తే పంచాయతీ సెక్రటరీ అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ లెండుగూరే శ్యామ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

చెలిమెల ప్రాజెక్టు దుస్థితి

చెలిమెల నీళ్లు.. పంటలకు చేరవు

- మరమ్మతులు లేక పూడుకపోయిన కాలువలు
- బోరు మోటార్లపైనే ఆధారం
- తగ్గిన వరి సాగు విస్తీర్ణం

పిచ్చిమొక్కలతో నిండిపోయిన పంట కాలువలు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ తిర్యాణి, సెప్టెంబర్ 18 : తిర్యాని మండలంలో చెలిమెల (ఎన్‌టీఆర్) ప్రాజెక్టులో నీళ్లున్నా ఆయకట్టుకు నీరందించలేని పరిస్థితి నెలకొన్నది. మరమ్మతు చేయకపోవడంతో కాలువలన్నీ పూడుకపోయాయి. వరి సాగు కోసం బోరు బావులపైనే రైతులు ఆధారపడుతున్నారు. ఓవైపు నీటి లభ్యత సరిపడా లేక, మరోవైపు కరెంటు కోతలతో నీరందక పంట దిగుబడిపై ప్రభావం చూపుతున్నది. ప్రాజెక్టులో సైతం పూడిక తీయకపోవడంతో నీటి సామర్థ్యం తగ్గింది. ఉన్న నీటినైనా పంటలకు వాడుకుందామంటే కాలువలు సరిగ్గా లేక నీరు అందని పరిస్థితి నెలకొన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాని మండల రైతులకు ప్రధానమైన సాగునీటి వనరు చెలిమెల(ఎన్‌టీఆర్) ప్రాజెక్టు. దాదాపు 6 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టును నిర్మించారు. గత యాసంగిలో ఈ ప్రాజెక్టు ఆయకట్టు కింద కేవలం 180 ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు కాలువలను ఆధునీకరించి రైతుల పంటలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నది. వర్షాలు లేనప్పుడు ఈ కాలువల్లోని నీటిని 24 గంటల ఉచిత విద్యుత్‌ని వినియోగించుకొని పంటలకు నీరందించారు. కాని ఈ ఏడాది వర్షాకాలంలో సైతం పంట కాలువల ద్వారా నీళ్లు రావడం లేదు.

పూడుకపోయిన కాలువలు..

చెలిమెల ప్రాజెక్టు కాలువలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.దీంతో ప్రాజెక్టులో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా రైతులు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో రైతులు బోరు మోటర్లపై ఆధారపడి నీళ్లు అందించాల్సిన పరిస్థితి నెలకొన్నది. కరెంటు ఎప్పుడు ఉంటదో ఎప్పుడు పోతదోనని తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చాలా మంది రైతులు వరి సాగును తగ్గించుకున్నట్లుగా తెలుస్తున్నది.

నీళ్లు లేక వరి సాగును తగ్గించిన..

గత ఏడాది నాకున్న మూడు ఎకరాలతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. కాని ఈ ఏడాది ఎనిమిది ఎకరాల వరి పంటకు నీళ్లు అందుతాయని నమ్మకం లేకుండా పోయింది. మూడు ఎకరాల్లో మాత్రమే వరి వేశాను. చెలిమెల ప్రాజెక్టు కాలువల ద్వారా నీరు అందడం లేదు. మోటారు ద్వారా మూడెకరాల కంటే ఎక్కువగా నీరు అందించే పరిస్థితి లేదు. ఇప్పుడు నేను సాగుచేసే మూడు ఎకరాల్లో కూడా సరైన దిగుబడి వస్తుందనే నమ్మకం కలగడం లేదు.

- పల్లె సుధాకర్, నాయికపు గూడ, తిర్యాని మండలం

కాలువలకు మరమ్మతు చేయించాలి

వరి పంటకు సరిగా నీరు అందకపోతే దిగుబడిపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. చెలిమెల ప్రాజెక్టు కాలువల ద్వారా నీరు అందే పరిస్థితి లేదు. కరెంటు మోటార్ల ద్వారా కూడా పంటకు కావాల్సిన విధంగా నీరు అందించలేకపోతున్నాం. అన్ని మడులు తడవడం లేదు. నేను సాగుచేస్తున్న మూడు ఎకరాలకు కూడా నీరు సరిగా పెట్టలేకపోతున్న. ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేసి పంటలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి.

- గుండం వెంకన్న, నాయికపుగూడ, తిర్యాణి

కేకే-5 గని ప్రమాదంలో కార్మికుడి మృతి

- మ్యాన్‌రైడింగ్‌పై నుంచి పడి గాయాలు
- గని ప్రమాదంగా పరిగణించాలని కార్మికుల ధర్నా

మోకనపల్లి లక్ష్మణ్(ఫైల్)

కేకే-5 గని ఆవరణలో ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

మందమర్రి, సెప్టెంబర్ 18: సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే -5 గనిలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మోకెనపల్లి కోల్‌కట్టర్ పని చేసే కార్మికుడు లక్ష్మణ్(44) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం..మందమర్రి పట్టణంలోని రెండవ జోన్ కాలనీకి చెందిన కోల్ కట్టర్ కార్మికుడు లక్ష్మణ్ మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిలో రెండవ షిఫ్టులో విధులకు వెళ్లి గనిలో నుంచి వచ్చేందుకు మ్యాన్ రైడింగ్ ఎక్కాడు. దానిపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి పోయాడు. కార్మికులు గమనించి పైకి తీసుకువచ్చి కేకే డిస్పెన్సరీకి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేక పోవడంతో రామకృష్ణాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. పరీక్షించిన ఏరియా దవాఖాన వైద్యులు లక్ష్మణ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియల కోసం మృతదేహాన్ని స్వగ్రామమైన ధర్మారం తీసుకువెళ్లారు. లక్ష్మణ్‌కు భార్య సరిత, కూతురు అర్చన, కుమారుడు అజిత్ ఉన్నారు. ఈ ప్రమాదం పై ఏరియా జీఎం దేవేందర్ ఘటనా స్థలాన్ని సందర్శించి గని అధికారులతో కలిసి విచారణ చేపట్టారు. దవాఖానలో మృతదేహం వద్ద టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నాయకులు సంతాపం తెలిపారు.

గని ప్రమాదంగా పరిగణించాలని కార్మికుల ధర్నా

మ్యాన్ రైడింగ్‌పై వస్తూ కింద పడి మరణించిన లక్ష్మణ్ మృతి సాధారణ మరణంగా అధికారులు పేర్కొంటున్నారనే విషయం తెలుసుకుని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మణ్ మృతి చెందిన సంఘటనను గని ప్రమాదంగా పరిగణించి, కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం గని వద్ద కార్మికులు, టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు ఆందోళన చేపట్టారు. భూగర్భగనుల్లో రక్షణ చర్యలు చేపట్టడంతో యాజమాన్యం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. కార్మికుడు మ్యాన్ రైడింగ్‌పై పడిపోతే కనీసం స్ట్రక్చర్ అందుబాటులో ఉంచలేదని, అంబులెన్స్ కూడా సమయానికి రాలేదని, కేకే డిస్పెన్సరీకి వెళ్తే వైద్యులు అందుబాటులో లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల నాయకులను సైతం కార్మికులు నిలదీశారు. ఎట్టకేలకు యాజమాన్యం లక్ష్మణ్ విధి నిర్వహణలోనే మరణించినట్లుగా పరిగణిస్తున్నామని ప్రకటించడంతో కార్మికులు ఆందోళన విరమించి విధులకు హాజరయ్యారు.

శుభకార్యం జరగాల్సిన కుటుంబంలో విషాదం

కేకే ఐదు గని ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మణ్ కూతురి కుమారుడి మొదటి పుట్టిన రోజు వేడుకలు గురువారం ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఒక్క రోజు ముందే లక్ష్మణ్ మృతి చెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.

పరిశుభ్రతే లక్ష్యంగా..

- ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు
- అక్టోబర్ 2 వరకు కొనసాగింపు..
- పారిశుధ్య పనులు చేసిన అధికారులు, కార్మికులు

గోదావరిలో చెత్తను తొలగిస్తున్న కమిషనర్, సిబ్బంది, కార్మికులు

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 18 : గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా పేరిట పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలకు అవగాహన పెంపొందించాలనే ఆలోచనతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం మంచిర్యాల పట్టణంలోని గోదావరిలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో మేనేజర్ విజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్, అధికారులు, కార్మికులు కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 1 వరకు స్వభావ్ స్వచ్ఛతా, సంస్కార్ స్వచ్ఛతా అనే నేపథ్యాన్ని ఉపయోగించి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్‌ను దేశవ్యాప్తంగా జరుపుకుంటారు.

మూడు ప్రధాన అంశాలపై దృష్టి

- ఈసారి నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించనున్నారు. ఇందులో మొదటగా స్వచ్ఛతా కీ భాగీదారి పేరిట పరిశుభ్రత కోసం భాగస్వామ్యంలో భాగంగా స్వచ్ఛ భారత్ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తారు. వ్యర్థాల నుంచి కళాత్మకమైన ఆకృతులను తయారు చేయడం, స్వచ్ఛమైన ఆహార విధులు ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి.
- రెండో దశలో సంపూర్ణ స్వచ్ఛత, శానిటేషన్ టార్గెట్ యూనిట్ అనే అంశంపై దృష్టిసారించనున్నారు. ఇందులో భాగంగా సామూహిక పరిశుభ్రత డ్రైవ్‌లు నిర్వహించడం, బ్లాక్ స్పాట్‌లను, క్లీన్ నినేస్ టార్గెట్ యూనిట్‌లను గుర్తించడం చేస్తారు. యూనిట్లు గుర్తించిన అనంతరం పరిశుభ్రం చేయడం, అవసరమైన చర్యలు తీసుకోవడం చేస్తారు. ● మూడో దశలో సఫాయి మిత్ర సురక్ష శిబిరాలు నిర్వహిస్తారు. ఇందులో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్యం, సంక్షేమం కోసం సింగిల్ విండో క్యాంపులను నిర్వహిస్తారు. దాదాపు 15 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛంద సంఘాల సభ్యులు, పొదుపు సంఘాల మహిళలు ఇందులో భాగస్వాములు అవుతారు. వీరంతా ప్రతిరోజు వారికి కేటాయించిన జోన్లవారీగా ఇంటింటికీ వెళ్లి పారిశుధ్యం, పరిశుభ్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. నివాస స్థలాలు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాలలో ప్రత్యేక బృందాలు పర్యటించి పరిశుభ్రత, పచ్చదనం ఆవశ్యకతను వివరిస్తారు. విరివిగా మొక్కలు నాటాలని సూచిస్తారు. ప్రతివారంలో రెండు గంటలు పారిశుధ్య పనులు నిర్వహించడం, పరిశుభ్రత కోసం పాటుపడడం వంటివి చేయాలని ప్రజలకు వివరించనున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

జాబితాపై అభ్యంతరాలుంటే తెలుపాలి

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్ 18 :గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం కల్టెరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 335 గ్రామపంచాయతీల్లో ముసాయిదా ఓటర్ల జాబితా వార్డుల వారీగా ప్రచురించామని, అభ్యంతరాలుంటే ఈ నెల 21వ తేదీ వరకు సంబంధిత గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని తెలిపారు. ముసాయిదా జాబితాపై అందిన అభ్యంతరాలు ఈ నెల 26వ తేదీ వరకు పరిశీలించి 28న తుది ఓటరు జాబితాను అన్ని గ్రామపంచాయతీల్లో ప్రచురిస్తామని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాలలో జాబితా ప్రచురిస్తామని, ఆన్ లైన్ లో https://draftrolls.tsec.gov.in/gpwardwisevoterlistrural1.do లో పొందుపరచామన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతి గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మండలంలోని గుండి ప్రభుత్వ పాఠశాలను పదవ తరగతిగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం గుండి మాజీ ఎంపీటీసీ గాదవేని మల్లేశ్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీని శాలువాతో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వీటిలోనే పిల్లలను చదివించాలని తల్లిదండ్రులను కోరారు. ఇన్‌చార్జి డీఈవో ఉదయ బాబు, నాయకులు అబ్దుల్లా, అమన్, దత్తు, శ్యామ్ రావు ,అసద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, సెప్టెంబర్ 18 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బెల్లంపల్లి మండలంలోని పెర్కపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, బట్వాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. గదులు, పరిసరాలు, రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థుల కోసం తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు, ఇతర అన్ని వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ఉపాధ్యాయులు విధులపై బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అర్థమయ్యే రీతిలో బోధించాలని ఆదేశించారు. అనంతరం బట్వాన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రిజిష్టర్లు పరిశీలించారు. కార్యాలయ పరిసరాలతో పాటు గ్రామంలో పారిశుధ్య నిర్వహణ తీరును పర్యవేక్షించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలుపాలి

నస్పూర్, సెప్టెంబరు 18 : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీపీవో వెంకటేశ్వర్‌రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ముసాయిదా ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 311 గ్రామపంచాయతీల్లో మొదటి విడుతలో బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూర్ , వేమనపల్లి, రెండవ విడుతలో భీమారం, చెన్నూరు, జైపూర్, కోటపల్లి, మందమర్రి, మూడవ విడుతలో దండేపల్లి, హాజీపూర్, జన్నారం, లక్షెట్టిపేట మండలాల్లోని గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని 311 గ్రామపంచాయతీల్లో 2,730 వార్డుల్లో 1,87,402 మంది పురుష ఓటర్లు, 1,91,468 మంది మహిళ ఓటర్లు, 17 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా వార్డుల వారీగా ప్రచురించామని, అభ్యంతరాలుంటే ఈ నెల 21లో సంబంధిత గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలు అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ముసాయిదా జాబితాపై అందిన అభ్యంతరాలు ఈ నెల 26 వరకు పరిశీలించి 28న తుది ఓటరు జాబితాను అన్ని గ్రామపంచాయతీల్లో ప్రచురిస్తామని తెలిపారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679